## క్లుప్తంగా

### వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

**సి.బెళగల్:** మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోన వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలను అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్లు, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

### సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని వినతి

**ఓర్వకల్లు:** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న మహిళలకు సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు బండమీది నారాయణ అధికారులను కోరారు. శనివారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మీదివేముల గ్రామానికి ప్రత్యేకాధికారిగా వచ్చిన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిని కలిసి కాలనీసమస్యలపై వినతి పత్రం సమర్పించారు. కాలనీలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్డి లేక తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారని తెలిపారు. కాలనీ చుట్టూ ఉన్న నీటి కుంటను పూడ్చివేయాలని, నీటి నిలువతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నట్లు పేర్కొన్నారు. పరిష్కారానికి కృషి చేస్తామని అధికారి సమాధానం ఇచ్చారు.

### గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

**ఓర్వకల్లు:** ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఓర్వకల్లు, పూడిచెర్ల, మీదివేముల పంచాయతీల ప్రత్యేకాధికారులు రమణయ్య, ఎల్.భాస్కర్, ఎం.సుధీర్ బాబు అన్నారు. శనివారం ఓర్వకల్లు, పూడిచెర్ల, మీదివేముల గ్రామాల్లో 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రామ పంచాయతీ రికార్డులు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

### నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

**ఓర్వకల్లు:** ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలుగా, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారని శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాధాకృష్ణన్ ఉపాధ్యాయునిగా విద్యా వ్యవస్థకు చేసిన సేవలకు గుర్తింపుగా గురుపూజోత్సవాన్ని ఏటా జరుపుకుంటున్నామని తెలిపారు. గురు-శిష్య సంబంధం పవిత్రమైనదని, ప్రతి ఉపాధ్యాయుడు శిష్యులను తనకన్నా గొప్పస్థాయికి తీసుకెళ్లే తపనతో పనిచేయాలని సూచించారు. తల్లిదండ్రుల తర్వాత ఆ స్థానాన్ని ఉపాధ్యాయులే భర్తీ చేయగలరని, విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించేలా బోధించాలన్నారు. ఉపాధ్యాయ వృత్తిని దైవకార్యంగా భావించి విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు.

### సచివాలయ ఉద్యోగుల నిరసన



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

**కల్లూరు:** మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ.. ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఇంటింటి క్లస్టర్ పనులనూ కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తాము ప్రభుత్వ ఉద్యోగులమే కానీ వలంటీర్లు కాదని తెలిపారు. ఉద్యోగులకు జాబ్ చార్ట్ పరంగా విధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

### పకడ్బందీగా స్వామిత్వ సర్వే

**పాణ్యం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శనివారం భూపనపాడు గ్రామంలో జరుగుతున్న సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి యజమానితో పాటు పొరుగు వారికి తెలియజేసి కొలతలు వేసి, తర్వాత నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఇళ్ల నమూనాలు, విస్తీర్ణం వివరాలు సేకరించామని తెలిపారు. స్థలాలపై హక్కుల విషయంలో క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఒకసారి సర్వేలో తప్పు జరిగితే పరిష్కారానికి ఎక్కువ సమయం పట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు గుర్తించి నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు 30-40 ఇళ్ల వరకు సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం స్వామిత్వ సర్వే టీమ్ వివరాలను పరిశీలించారు.

# యూరియా కొరత.. అన్నదాతల కలత

- అరకొరగా నిల్వలు
- ఎన్ని ఎకరాలు ఉన్నా రెండు బస్తాలే సరఫరా
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- కాంప్లెక్స్ ఎరువులు అంటగడుతున్న డీలర్లు



గడిగరేవుల ఆర్‌ఎస్‌కే వద్ద వేచియున్న అన్నదాతలు



బూజునూరు సచివాలయం వద్ద యూరియా కోసం వేచివున్న రైతులు

**గడివేముల:** మండలంలో ఎక్కువశాతం వరి పంటలనే సాగు చేస్తుంటారు. వరి నాటినప్పటి నుంచి కంకులు ఏర్పడే వంత వరకు యూరియా ఎంతో అవసరం. గడివేముల మండలం పెసరవాయి,కరిమద్దెల, చిందుకూరు,బూజునూరు, కొరటమద్ది,దుర్వేశి,బిలకలగూడూరు గ్రామాల్లో కేసీ, బోర్ల కింద అధిక సంఖ్యలో వరి పంటను సాగు చేస్తున్నారు. మండలంలో 22 వేల ఎకరాల వరకు వివిధ పంటలు సాగుచేస్తారు. ఎక్కువశాతం యూరియా అవసరయ్యే పంటలే. ఇప్పటికే అదును దాటినా ఏ పంటలు సాగు చేయలేకపోవడంతో పాటు, సరిపడా ఎరువులు లేకుండా పంటలను ఎలా సాగు చేస్తామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఆరకొరగా పంపిణీ చేశారు. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఒకటి రెండు లారీల బస్తాలు యూరియా తీసుకొస్తున్నా రైతులకు సరిపోవడం లేదు. గ్రామాల్లో ఒక్క ఎకరా ఉన్న రైతుకు పది ఎకరాలు ఉన్న రైతుకు రెండు బస్తాలే ఇస్తుండడంతో ఇచ్చిన యూరియా ఏం చేయాలో అర్థం కావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. కొందరు ప్రైవేట్ ఎరువుల డీలర్ల వద్ద యూరియా నిల్వలు ఉన్నాయి. అయితే అవి కొనాలంటే ఇంకో ఎరువు కొంటే ఇస్తామని కారఖండిగా చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ దాడులు చేస్తున్నప్పటికీ, ఎంఆర్‌పీకే అమ్మాలని చెబుతున్నా కొంత మంది డీలర్లు ఖాతరు చేయడం లేదు. ఇప్పటికే ఖరీఫ్‌లో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, పంటలు సాగు చేశారు. విత్తనాలు నాటిన సమయంలో యూరియా దొరకకపోవడంతో వేయలేదు. దీంతో దిగుబడులు అరకొరగా వచ్చే పరిస్థితి నెలకొంది.

**వైఎస్సార్‌సీపీ హయాంలో పుష్కలంగా ఎరువులు**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన ఎరువులను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించారు. రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్ మిషన్‌లో కావాల్సిన ఎరువులు ఆర్డర్ చేసుకునేవారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువుల కొరత లేకుండా గత ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకునేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులకు కష్టాలు వచ్చాయని రైతుల ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని సరిపడినంత మేర యూరియా అందించాలని మండల రైతులు కోరుతున్నారు.



బలపనూరులో క్యూలైన్‌లో వేచి ఉన్న రైతులు



గోనవరం సచివాలయం వద్ద రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ



భూపనపాడులో యురియా కోసం గుమికూడిన రైతులు

### ఏ మూలకు సరిపోదు



మా గ్రామంలో వివిధ పంటలు సాగు చేస్తున్నాను. ఎక్కువ శాతం వరి పంట వేశాను. వరికి యూరియా ఎంతో అవసరం. ఎంత పొలం ఉన్నా రెండు బస్తాలే ఇస్తున్నారు. అంత పొలానికి ఏ మూలన సరిపోయే పరిస్థితి లేదు. రెండు బస్తాల కోసం కొద్ది రోజల క్రితం పొలం పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చాను. శనివారం గ్రామానికి యూరియా రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి రైతు సేవా కేంద్రం వద్ద ఎదురు చూడాల్సి వచ్చింది. ఎప్పుడూ లేని విధంగా పోలీసులను కాపలా పెట్టి యూరియా అందించారు.

– నిరంజన్‌రెడ్డి, రైతు, పెసరవాయి

### ఇబ్బందులు పడుతున్నాం



ప్రభుత్వం ఇచ్చే రెండు బస్తాల యూరియా కోసం గంటల పాటు ఎండలో నిలబడుతున్నాం. 20 రోజుల క్రితం నాలుగు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను వేశాను. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి యూరియా అరకొరగా ఉంది. కూటమి నాయకులు చెప్పిన వారికే ఎరువులు అందాయి. మొక్కజొన్న, మిరప పంటలకు అవసరమైన యూరియా వేయలేకపోయాను. భారీగా దిగుబడి తగ్గనుంది. ఇప్పకైనా అధికారులు స్పందించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలి.

– తలారీ బాలచెన్ని, రైతు, గడివేముల

### పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ

**పాణ్యం:** మండలంలోని నాలుగు రైతు సేవా కేంద్రాల్లో శనివారం యూరియా పంపిణీ జరిగింది. పోలీసుల సమక్షంలో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఒక్కో బస్తా చొప్పున అందించారు. ఉదయాన్నే రైతులు పెద్ద సంఖ్యలో కేంద్రాలకు చేరుకోవడంతో టోకెన్ విధానం అమలు చేశారు. ఈ పంపిణీని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌లు పరిశీలించారు.

- బలపనూరు సచివాలయానికి 532 బస్తాలు వచ్చినప్పటికీ, వారం క్రితమే పేర్లు నమోదు చేసే ప్రక్రియ పూర్తయింది. ఈ విషయం తెలియక చాలా మంది రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. తిరిగి సోమవారం నమోదు చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరి సాగు ఎక్కువగా ఉండటంతో ఎకరానికి ఒకే బస్తా యూరియాను కేటాయించడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు.
- భూపనపాడు గ్రామానికి రెండు రోజుల క్రితం 532 బస్తాలు చేరడంతో పెద్ద సంఖ్యలో రైతులు సచివాలయానికి తరలివచ్చారు. గంటలపాటు గందరగోళం నెలకొనగా, చివరకు క్షేత్రస్థాయి అధికారుల జాబితా ఆధారంగా యూరియా పంపిణీ చేశారు. ఆన్‌లైన్ నమోదు, ఓటీపీ ప్రక్రియలు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని వారు మండిపడ్డారు.
- గోనవరంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. యూరియా పంపిణీ వివరాలు స్పష్టంగా చెప్పాలని రైతులు అధికారులను నిలదీశారు. పాత, కొత్త సరఫరా వివరాలు తెలియజేయాలని కోరారు. ఉదయం టోకెన్లు ఇచ్చిన తర్వాత గందరగోళం తగ్గడంతో పంపిణీ పూర్తయింది. పరిస్థితిని సమీక్షించేందుకు ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్ఐలు గ్రామానికి చేరుకున్నారు.
- పాణ్యం సచివాలయంలో కూడా పోలీసులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ జరిగింది. పనులు వదిలిపెట్టి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని, ఆన్‌లైన్ నమోదు పేరుతో ఇంత ఇబ్బంది పెట్టి యూరియా ఇవ్వడం సరైన పద్ధతి కాదని రైతులు వాపోయారు.

# చంద్రబాబు మొద్దు నిద్ర వీడాలి

- రైతులు రోడ్డెక్కుతున్న కూటమి ప్రభుత్వానికి చలనం లేదు
- యూరియా కోసం పడిగాపులు కాస్తున్నా పట్టించుకోరా?
- ఈ నెల 9న అన్నదాత పోరు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి





అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

**కల్లూరు:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొద్దు నిద్ర వీడి రైతుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలను దగాకు గురి చేస్తుందన్నారు. శనివారం సాయంత్రం తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ నెల 9వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాట సాని మాట్లాడుతూ.. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన చేపట్టే అన్నదాత పోరులో భాగంగా నంద్యాల బొమ్మల సత్రంలోని వి.మార్ట్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతులతో ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తామన్నారు. రాష్ట్రంలో యూరియా, ఎరువుల కోసం రైతులు కొన్ని నెలలుగా అవస్థలు పడుతున్నా చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందన్నారు. రైతులు ఎరువులు కోసం క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగేందుకు అర్హుడేనా? అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రికి భోజనం గుర్తుకు రావడం దౌర్భాగ్యమన్నారు.

**కూటమి నేతల ఎరువుల దందా**

కూటమి నేతలు కృత్రిమ కొరత సృష్టిస్తూ రూ. 270 ఉన్న యూరియా బస్తాను రూ. 450 నుంచి 600 వరకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో బస్తా మీద రూ. 200 నుంచి 300 వరకు రైతుల నుంచి దోచుకుంటున్నారన్నారు. ఎరువులను టీడీపీ నాయకులే దారి మళ్లించి అధిక ధరకు అమ్ముకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు పాతరేసిందన్నారు. రైతులకు అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు. రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తివేసిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రైతుకు అండగా నిలిచిందని కాటసాని అన్నారు. ఏనాడు రైతులు ఎరువులు, పంటల గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కలేదన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రేణుక, పార్టీ మహిళ జోనల్ విభాగం అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కేవీ రమణారెడ్డి, కల్లూరు ఎంపీపీ శారద, పలువురు కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంస్థల తనిఖీ

**సి.బెళగల్:** పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా అధికారులు సి.బెళగల్, గుండ్రేవుల, పలుకుదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. కర్నూలు డీఎల్‌డీఓ రమణారెడ్డి ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి సి.బెళగల్లోని ఆరవ అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, ఎస్సీ, బీసీ హాస్టళ్లతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేశారు. వసతులు, సౌకర్యాల పై వార్డెన్లు రమేష్, భాస్కర్‌లను అడిగి తెలుసుకున్నా రు. జెడ్పీ హైస్కూల్‌లో కట్టెల పొయ్యిపై మధ్యాహ్న భోజనం తయారు చేస్తుండటం గమనించి తప్పనిసరిగా గ్యాస్ స్టవ్ వినియోగించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్.. డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరితో కలిసి గుండ్రేవులలో పర్యటించి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. పలుకుదొడ్డి గ్రామంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ చెన్నయ్య తదితరులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

## ట్రాక్టర్ బోల్తా.. కూలీలకు గాయాలు

**సి.బెళగల్:** ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన 20 మంది వ్యవసాయ కూలీలు శనివారం ఉదయం ఉల్లి కోత పనులకు గోనెగండ్ల మండలం అలువాల గ్రామానికి ట్రాక్టర్‌పై బయలుదేరి వెళ్లారు. పొలానికి చేరుకునే నిమిత్తం కాలువ కట్టపై అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో కూలీలు బోయ వెంకటేశ్వరమ్మ, ఉమామహేశ్వరి, చాకలి మునేశ్వరి, నాగలక్ష్మి, శేషమ్మ, రోజా మంగలి వీరాంజనేయులు తదితరులు గాయపడ్డారు. స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ఆర్‌ఎంపీతో ప్రథమ చికిత్స చేయించారు. కాగా చాకలి మునేశ్వరిని కర్నూలుకు తరలించారు.

## గ్రామాల్లో జిల్లా అధికారుల పర్యటన

**కోడుమూరు రూరల్:** 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా అధికారులు శనివారం మండలంలోని కోడుమూరు, అమడగుంట్ల, లద్దగిరి, పులకుర్తి గ్రామాల్లో పర్యటించారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వెంకటరాముడు, ఎంపీడీఓ రాముడు కోడుమూరు మోడల్ స్కూల్, ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లద్దగిరిలో బాలుర వసతిగృహాలు, పీహెచ్‌సీ, హైస్కూల్, హెల్త్, అంగన్‌వాడీ సెంటర్లను డీఎంఅండ్‌హెచ్ఓ శాంతికళ తహసీల్దార్ నాగరాజుతో తనిఖీ చేశారు. పులకుర్తిలో ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ చిరంజీవి, అమడగుంట్లలో జిల్లా అగ్నిమాపక దళాధికారి చిన్నబజారి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

**గూడూరు మండలంలో..**

ఆర్.ఖానాపురం గ్రామంలో శనివారం జరిగిన పల్లెకి పోదాం కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ పర్యటించి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేవారు. నీటి కుంటను పరిశీలించి ప్రజల ఇబ్బందులపై చర్చించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వెంకటేష్ నాయక్ ఉన్నారు.

# కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దుర్భరం

- జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు



కరపత్రాలను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

**ఓర్వకల్లు:** కల్లబొల్లి హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందని జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు అన్నారు. శనివారం స్థానిక రాక్‌గార్డెన్‌లో ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. ఈ ఏడాది ఉల్లి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎకరాకు రూ.40-50 వేల వరకు పెట్టుబడి పెట్టినా, క్వింటాకు కేవలం రూ.1200 మద్దతు ధర ఇవ్వడం దారుణమన్నారు. కనీసం రూ.2 వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. గత జగన్ పాలనలో సబ్సిడీ విత్తనాలు, మద్దతు ధరతో రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం 16 నెలలు గడిచినా రైతు సమస్యల పరిష్కారానికి ఏ చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

**నిరసనలకు సిద్ధం**

రైతు సమస్యలపై ఈ నెల 9న జిల్లా కేంద్రాల్లో 'అన్నదాత పోరు' చేపడతామని పాలకొలను రమేష్ అన్నారు. రైతులు పండించిన శనగ, కంది, వరి, పత్తి పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, లేకపోతే రైతులు రోడ్లపై రావాల్సిన పరిస్థితి వస్తుందని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. యూరియా కొరత గతంలో ఎప్పుడూ లేదని, కూటమి ప్రభుత్వంలోనే ఏర్పడిందని తిప్పాయపల్లె హరినాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అధికారం చేపట్టగానే అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రైతులకు ఎరువులు, సబ్సిడీ విత్తనాలు సకాలంలో అందించాలని నాగతిరుపాలు డిమాండ్ చేశారు.

**కరపత్రాల విడుదల**

రైతు పోరుకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా నాయకులు విడుదల చేశారు. రాష్ట్రంలో రైతుల సమస్యలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 9న జరిగే 'అన్నదాత పోరు'లో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు జీకే వెంగన్న,సింగిల్ విండో మాజీ చైర్మన్లు నాగతిరుపాలు, బి.చంద్రశేఖర్‌రెడ్డి, గోపా రమణారెడ్డి, శివవెంకటకృష్ణారెడ్డి, ఉస్మాన్‌వలి, చిన్న అయ్యన్న, పాల మధు తదితరులు పాల్గొన్నారు.

## 'అన్నదాత పోరు'కు సిద్ధం కండి

**కర్నూలు(రూరల్):** యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయ కర్త, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఉదయం 10 గంటలకు కర్నూలులోని తన స్వగృహంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీస్‌తో కలిసి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరుకావాలన్నారు.

## రైతుల ఆత్మహత్యాయత్నంపై జేడీ విచారణ

**సి.బెళగల్:** మండలంలోని పోలకల్లు గ్రామంలో ఉల్లి పంటను సాగుచేసిన ఇద్దరు యువ రైతులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై ఆయా శాఖల అధికారులు విచారణ చేపట్టారు. శనివారం జిల్లా వ్యవశాఖ సంయుక్త సంచాలకులు వరలక్ష్మి.. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి గ్రామానికి చేరుకుని బాధిత రైతులు నిల్వ చేసిన ఉల్లి దిగుబడులను పరిశీలించారు. అలాగే మండలంలో ఉల్లి పంటల నష్టాలపై కోడుమూరు ఉద్యానవన అధికారి (హెచ్ఓ) మధన్‌మోహన్‌గౌడ్ అడిగి తెలుసున్నారు.

# రైతుల పక్షాన పోరాడుతాం




మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి

- 9న యూరియా కొరతపై నిరసన
- వైఎస్సార్‌సీపీ నాయకులు

**పాణ్యం:** రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులకు కూటమి ప్రభుత్వమే కారణమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. శనివారం పాణ్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9న యూరియా కొరతపై నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ ఆర్‌బీకే ద్వారా జరిగేవని, రైతులు ఎప్పుడూ రోడ్లపైకి రాలేదని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో రైతులు యూరియా కోసం ఎండలో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందన్నారు. రైతులపై చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి రైతులకు అవసరమైన యూరియా ఎంత అనేది కూడా తెలియదా?'' అని ప్రశ్నించారు. గత ఏడాది గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కిన రైతులు, ఈ ఏడాది యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, ప్రభుత్వం సరిపడా యూరియా అందించకపోతే ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. రైతులందరూ ఈనెల 9న నంద్యాలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రామలక్ష్మయ్య, తొగర్చేడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చాంద్ బాషా, మద్దూరు శ్రీనాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత పోరును విజయవంతం చేద్దాం



అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కల్లూరు:** ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ పాణ్యం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కేవీ రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి నేతలు యూరియాను కృత్రిమ కొరతు సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతన్నలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాయకులు ఈశ్వరయ్య, శ్రీధర్‌రెడ్డి, కేశవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సుంకన్న, హనుమంతురెడ్డి, సుబ్రమణ్యం శెట్టి, సత్యంరెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, చాంద్‌బాషా పాల్గొన్నారు.